ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6 • కనిష్ఠం 24.9



'మానవ మనుగడకు మొక్కలు అవసరం'

కుంటాల, జూలై 2(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలు ఎంతో దోహదపడుతాయని డీపీవో శ్రీనివాస్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఆయన ఇంటింటికి మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీఒక్కరు ఇంటి ముందు, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి, సంరక్షించాలని పేర్కొన్నారు. వర్షాలు విస్తారంగా కురవాలంటే చెట్లు ఎంతో అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రహీం, పంచాయతీ సెక్రెటరీ రాజబాబు, తదితరులు ఉన్నారు.



• బాసరలోని సరస్వతీ మాత పుణ్యక్షేత్రం



• బాసర అమ్మవారి మూర్తి విగ్రహం



• కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవిస్తున్న ఆలయ అధికారులు(ఫైల్)

బాసరపై.. చిన్నచూపు!

- చదువుల తల్లి ఆలయ అభివృద్ధికి కరువైన 'లక్ష్మీ' కటాక్షం
- ప్రసాద్ స్కీమ్‌లో బాసరను పరిగణలోకి తీసుకోని కేంద్ర ప్రభుత్వం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆలయ పండితుల విన్నపం
- ప్రసాద్ స్కీమ్ మంజూరుపై ఏడేళ్లుగా నిరీక్షణ
- పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- 2027లో ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు
- నది తీరంలో అస్తవ్యస్తంగా మారిన పుష్కర ఘాట్లు
- భక్తులకు తప్పని తిప్పలు

నిర్మల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): దేశంలోనే జ్ఞాన సరస్వతీ దేవాలయాలు రెండు మాత్రమే ఉన్నాయి. ఒకటి కాశ్మీర్‌లో ఉండగా.. మరొక దేవాలయం నిర్మల్ జిల్లాలోని బాసరలో ఉంది. ఇక్కడి పుణ్యక్షేత్రంలో అమ్మవారు జ్ఞాన సరస్వతీగా పిలువబడుతూ భక్తులకు దర్శనమిస్తోంది. బాసరలోని జ్ఞాన సరస్వతీ దేవాలయం దక్షిణ దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా పేరుగాంచింది. ఇక్కడ సరస్వతీ దేవి జ్ఞానాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. పురాణాల ప్రకారం వేదవ్యాసుడు కురుక్షేత్ర యుద్ధం తర్వాత ఇక్కడ తపస్సు చేశాడని, సరస్వతీ దేవిని ప్రతిష్ఠించాడని ప్రతీతి. ఈ ఆలయం చాళుక్యుల కాలంలో నిర్మించబడిందని చెబుతారు. భక్తులకు విద్యాబుద్ధులు ప్రసాదించేందుకు బాసరలో కొలువు దీరిన ఘనమైన చరిత్ర కలిగిన జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి మాత్రం 'లక్ష్మీ' కటాక్షం దక్కడం లేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి కృప కటాక్షాలను పొందేందుకు దేశ నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులు ఆలయ దుస్థితిని చూసి పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంత నిలయంపై పట్టింపేది?

భారత పురాణాల ప్రకారం కురుక్షేత్ర యుద్ధం అనంతరం వేదవ్యాసుడు తపస్సు గావించేందుకు సంచరిస్తుండగా.. ప్రశాంతతకు నిలయంగా కనిపించిన ఈ గోదావరి నదితీరం తన తపస్సుకు అనువైన స్థలంగా భావించాడు. వేదవ్యాసుడు తపస్సు చేస్తున్న సమయంలో అమ్మవారి ఆదేశం మేరకు విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు చెబుతారు. కాలక్రమంలో చాళక్యుల కాలంలో అమ్మవారి ఆలయం నిర్మించబడిందని చెబుతారు. ఈ ఆలయానికి వస్తే ఎంతటి ఒత్తిడి ఉన్న మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తులు పరవశించిపోతారు. ఇటువంటి ప్రశాంత నిలయంగాపై పాలకుల పట్టింపు లేకపోవడం ఇక్కడికి వచ్చే భక్తుల్లో తీవ్ర అసంతృప్తిని మిగులుస్తోందని చెబుతున్నారు. దేశంలో ఉన్న రెండు జ్ఞాన సరసతీ ఆలయాల్లో ఒకటైన బాసరపై అటు కేంద్ర ప్రభుత్వం గాని ఇటు రాష్ట్ర ప్రభుత్వం గాని అభివృద్ధి పట్ల దృష్టి సారించక పోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం పాలకుల పట్టింపు లేని తనంతో శిథిలావస్థకు చేరినట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిస్తే అమ్మవారి ఆలయం పైకప్పు నుంచి వర్షపునీరు లోనికి వస్తుందని భక్తులు చెబుతున్నారు. ఘనమైన చరిత్ర కలిగిన జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరి వర్షపు నీటికి ఉరుస్తుండడం చూస్తే అమ్మ వారి ఆలయం పట్ల పాలకులకు ఎంత నిర్లక్ష్యం ఉందో మాటల్లో చెప్పలేమని భక్తులు మండిపడుతున్నారు.

'ప్రసాద్'పై కరుణించని కేంద్రం

దేశంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రత్యేకమైన 'ప్రసాద్' పథకాన్ని తెచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ పథకం పరిధిలోకి బాసర అమ్మవారి ఆలయాన్ని తీసుకురావడంపై ఇంకా కరుణించడం లేదని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ప్రతీ పుణ్యక్షేత్రానికి రూ.50 కోట్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోనే భద్రాచలం, రామప్ప, జోగులాంబ ఆలయాలను కేంద్రం ప్రసాద్ స్కీమ్‌లో చేర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఈ ఆలయాలకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఈ ఆలయాలకు కేంద్రం నిధులు మంజూరు చేసి అభివృద్ధి పథంలోకి తీసుకురావడంతో బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి సైతం ప్రసాద్ పథకం వర్తిస్తుందని అమ్మవారి భక్తులు భావించారు. కానీ కేంద్ర ప్రభుత్వం బాసరకు ప్రసాద్ పథకాన్ని వర్తింపజేయక పోవడంతో భక్తులకు నిరాశ తప్పలేదు. ఏడేళ్ల క్రితం ఆలయ పండితులంతా కలిసి ప్రస్తుతం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి బాసర అమ్మవారి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఏడేళ్లుగా బాసరను ప్రసాద్ పథకంలో చేరుస్తారని ఎదురుచూడడం తప్ప ప్రసాద్ పథకం మాత్రం బాసరకు వర్తింపజేయక పోవడంపై జిల్లా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చి రూ.50 కోట్లను మంజూరు చేస్తే ఆలయ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరుగుతుందని భక్తులు భావిస్తున్నారు.

పుష్కరాలకైనా అభివృద్ధి జరిగేనా?

ప్రతీ 12ఏళ్లకు ఓసారి నిర్వహించే గోదావరి నది పుష్కరాలు 2027లో రానున్నాయి. ఈ నేపథ్యంలో బాసర పుణ్యక్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు దేశవ్యాప్తంగా నలుమూలల నుంచి భక్తులు భారీగా బాసరకు తరలివస్తారు. ఈ క్రమంలో బాసరలోని గోదావరి నది తీరంలో పుణ్యస్థానాలను ఆచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. గోదావరి నది పుష్కరాల సమయంలో బాసరకు భక్తుల తాకిడి భారీగా ఉండనున్న నేపథ్యంలో కనీస సౌకర్యాలను కల్పించేందుకైనా ప్రభుత్వాలు ముందుకొచ్చేనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. గోదావరి నది తీరంలో ఉన్న పుష్కర ఘాట్లు దెబ్బతినడంతో ప్రస్తుతం వచ్చే భక్తులే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. మరి పుష్కరాల సమయంలో భారీగా తరలిరానున్న భక్తులకు ఈ పుష్కర ఘాట్లు ఏ విధమైన ఉపయోగకరంగా ఉంటాయో పాలకులు ఆలోచించాలని భక్తులు కోరుతున్నారు. కేంద్రం నిధులు మంజూరు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్రం నిధులు మంజూరు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం మోపుతూ బాసరను అభివృద్ధికి ఆమడ దూరంలో నిలపడం కాకుండా ఇప్పటికైనా బాసర పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు, ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే సహా ఆదిలాబాద్ పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీ కృషి చేయాలని అమ్మవారి భక్తులు కోరుతున్నారు.





మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో గోవింద్

మొక్కలు నాటి.. సంరక్షించాలి : జడ్పీ సీఈవో

సోన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో గోవింద్ వెల్లడించారు. బుధవారం సోన్ మండలంలోని న్యూ వెల్మల్‌లో మొక్కలు నాటారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. పీడీ డీఆర్డీవో నాగవర్ధన్, మండల ఎంపీడీవో సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్'

ఖానాపూర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్, ఐఐటీ, క్లాట్ (సీఎల్ఏటీ) లాంటి పోటీ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్‌లు అందజేస్తున్నట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం తెలిపారు. బుధవారం ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అధ్యాపకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అడ్మిషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లను పెంపొందించాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు సైతం జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయవంతం అయ్యేందుకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆన్‌లైన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకునేలా అధ్యాపకులు వివరించాలన్నారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 263 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

భైంసా, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం ప్రాజెక్టులోకి 263 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు, 1.852 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 355.6 మీటర్లు ఉండగా 0.654 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. వరద నీరు వచ్చి చేరుతుండటతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమక్రమంగా పెరుగనుంది. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టులోకి 0.129 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. గత 8 నెలల కాలంగా అంతంత మాత్రంగానే నీటి నిల్వలతో బోసిపోయి కనిపించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టు ప్రస్తుతం వరద నీరు వచ్చి చేరుతుండడంతో జలకళను సంతరించుకుంటోంది. పర్యాటకుల తాకిడి మొదలయ్యింది.



గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి నీటి నిల్వలు

8నుంచి బాసరలో గురు పూర్ణిమ వేడుకలు

• రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు ఆహ్వాన పత్రాలను అందజేసిన ఆలయ అధికారులు

బాసర, జూలై 2(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ సన్నిధిలో ఈ నెల 8వ తేదీ నుంచి గురు పూర్ణిమ వేడుకలు ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి హాజరుకావాలని బుధవారం హైదరాబాదులో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సరస్వతీ అమ్మవారి ప్రసాదాలను అందించి మంత్రిని ఆలయం పండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ని హైదరాబాద్‌లో కలుసుకొని ఆహ్వాన పత్రాలను దేవాదాయశాఖ అధికారులు అందించారు. గురు పూర్ణిమ వేడుకలకు హాజరై కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి, ఏఈవో సుదర్శన్ గౌడ్ ఆలయ ప్రధానార్చకులు సంజీవ్ మహరాజ్, వేద పండితులు నవీన్‌శర్మ, తదితరులు ఆహ్వానించిన దేవస్థానం బృందంలో ఉన్నారు.



మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ సిబ్బంది



ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తూ..

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

• బాలశక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

భైంసా రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో బుధవారం నిర్వహిస్తున్న బాలశక్తి కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బాలశక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాలశక్తి అనే కార్యక్రమం ముఖ్యంగా నాలుగు అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, ఆరోగ్యం, అభివృద్ధి, ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్య అభివృద్ధి సాధికారత, క్షేత్ర పర్యటనలు జ్ఞాన సమపార్జన మొదలగు అంశాలపై కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించి ప్రతీ విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ తయారీ, విద్యార్థులలో రక్తహీనత, థైరాయిడ్, పోషకాహార లోపం, ఊబకాయము, విటమిన్ లోపం వంటి వ్యాధుల గుర్తింపు, వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా కిషోర బాలికలకు రుతు పరిశుభ్రతపై అవగాహన, విద్యార్థులందరికీ కంటి పరీక్షలు, విద్యార్థుల్లో మానసిక సమస్యలను గుర్తించి మానసిక వ్యాధి నిపుణులచే కౌన్సిలింగ్, పోషకాహారం వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులందరికీ సక్రమంగా పరీక్షలు అయ్యే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మతిన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

ఆర్జీయూకేటీ బాసర.. గ్లోబల్ లెర్నింగ్‌లో ముందడుగు

బాసర, జూలై 2(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌కు చెందిన కాకతీయ సాండ్ బాక్స్ (ఐకెఎస్), ఆర్జీయూకేటీ బాసరకు విద్యా సంవత్సరం 2025-26లో గణనీయమైన మద్దతు అందించింది. అమెరికాలోని ప్రఖ్యాత వార్టన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ఆఫర్ చేస్తున్న రెండు అంతర్జాయతీయ ప్రోగ్రాంలకు సంబంధించి రూ.40 లక్షల విలువైన 453 ఉచిత కోర్సెరా లైసెన్స్‌లు విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ ఏఎస్డీ ఈ. మురళీధర్షన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు లీడర్‌షిప్, ఇన్నోవేషన్, మషీన్ లెర్నింగ్ వంటి అత్యవసర నైపుణ్యాలలో అంతర్జాతీయ సర్టిఫికేషన్‌తో కూడిన అనుభవాన్ని పొందనున్నారు. ఇది వారి గ్లోబల్ అకడెమిక్ కెరీర్ అవకాశాలకు బలమైన అడుగు కావడం విశేషమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రోగ్రాంలు జూలై 2 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించబడతాయి. ఆర్గనైజేషనల్ లీడర్షిప్ అండ్ ఇన్నోవేషన్ (ఓఎల్ఐ) గేమ్-43 బృందాల్లో 164 మంది విద్యార్థులతో కూడిన టీం ఆధారిత సిమ్యులేషన్, మెషీన్ లెర్నింగ్ ఫర్ బిజినెస్ డిసిజన్(ఎంఎల్) స్వయంగా పూర్తి చేసుకునే కోర్సుగా 289 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యా ప్రయాణాన్ని విలువైనదిగా మార్చిన కాకతీయ సాండ్‌బాక్స్ వార్టన్ ఇంటెరాక్టివ్‌కి చెందిన జోషువా లాంబెర్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సుజయ్ సర్కార్, కోర్సు ఇన్స్ట్రక్టర్‌లుగా డాక్టర్ పి.స్వాతి, స్వప్నిల్, ఐఐఈడీ కోఆర్డినేటర్ డా. టి.రాకేశ్ రెడ్డి పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు ట్యాబ్‌లు, డిజిటల్ కెమెరాలను అందచేస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో సమర్థవంతంగా సేవలు : ఎస్పీ

భైంసా, జూలై 2(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసుశాఖ సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ పారదర్శకమైన తీరుతో సమర్థవంతంగా సేవలు అందిస్తోందని జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల పేర్కొన్నారు. బుధవారం భైంసాలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీసు అధికారులకు అత్యాధునిక ట్యాబ్‌లు, డిజిటల్ కెమెరాలు, హోమ్‌గార్డులకు ఉలెన్ జాకెట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి ఆదునిక యుగంలో అన్ని రంగాల్లోనూ సాంకేతిక పరిజ్ఞానం ఆధిపత్యం కొనసాగుతున్న దృష్ట్యా పోలీసు శాఖకు కూడా అందుకు అనుగుణంగా మార్పు చెందుతోందన్నారు. డిజిటల్ యుగం వైపు అడుగులు వేసి నేర పరిశోధనతో పాటు నిందితుల గుర్తింపు, అచూకి కనుక్కోవడం, ఆధారాల సేకరణ, సాక్షుల వివరాల నమోదు లాంటి చర్యల్లో ఎంతో పరిణతి సాధించడం జరిగిందన్నారు. ఇదే క్రమంలో తక్షణమే అవసరమైన సమాచారం, ఆధారాల సేకరణకు డిజిటల్ పరికరాలు ఎంతో ఉపయుక్తంగా మారాయని వెల్లడించారు.ఇందులో భాగంగానే జిల్లాలోని పోలీసు అధికారులతో పాటు బ్లూకోట్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వినియోగం కోసం గాను అత్యాధునిక ట్యాబ్‌లు, డిజిటల్ కెమెరాలను అందచేయడం జరుగుతోందన్నారు. తద్వారా నియమిత పనులను రికార్డు చేయడం, సమయానుగుణంగా నివేదికలు పంపేందుకు గాను ట్యాబ్‌లు, కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇక పోలీసు వ్యవస్థలో బాధ్యతాయుత భాగస్వాములైన హోంగార్డులు వర్షకాలంలో విధుల నిర్వహణ ప్రక్రియలో ఎదరయ్యే ఇబ్బందులను తొలగించేందుకు ఉలెన్ జాకెట్లను అందజేశామన్నారు. జిల్లా పోలీసు శాఖ నేరాల అదుపునకు, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పాటు పడుతోందని అన్నారు. ఇందులో భైంసా డివిజన్ పరిధిలోని సీఐలు గోపినాథ్, మల్లేష్, ఎస్ఐలు అశోక్, శ్రీనివాస్, నవనీత్ రెడ్డి, కృష్ణా రెడ్డి, హన్మాండ్లు, మహిళా ఎస్ఐలు పెర్సిస్, సుప్రియ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుంటాల, జూలై 2(ఆంధ్రజ్యోతి): మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అశోక్ అన్నారు. బుధవారం కుంటాల మండలంలోని కల్లూరు బస్టాండ్‌లో మహిళలకు మహిళా పోలీసు సిబ్బందితో కలిసి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు ఒంటరిగా వెళ్లిన సమయంలో, బస్సులో ప్రయాణించే సమయంలో బస్టాండ్‌లో బస్సుల కొరకు వేచి ఉన్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మహిళా సిబ్బందిచే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుంటాల పోలీసు సిబ్బంది, తదిదతరులు ఉన్నారు.

సారంగాపూర్: సైబర్ నేరాలపై ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని సీఐ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలో గల స్వర్ణ గ్రామములో ఎస్పీ డా.జానకీ షర్మీల ఆదేశాల మేరకు జరుగుతున్నటు వంటి నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1930ని ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. గ్రామంలోని వీధులలో సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామస్థులకు వివరిస్తూ.. సీసీ కెమెరాలను ఏర్పాటుకు గ్రామస్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వెంటనే గ్రామస్థులు స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రతీ గ్రామంలో గ్రామ పోలీస్ వ్యవస్థను బలపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఆకాష్, వినోద్, ఇక్బాల్, గిరిజ, అనసూయలు ఉన్నారు.

కిమ్స్‌లో ఉన్న అయాతిని ఎమ్మెల్యే పరామర్శ

ఉట్నూర్,జూలై2(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుస్సాడి కళాబృందం టీం లీడర్ కనక సుదర్శన్ కూ తురు కనక అయతిని బుధవారం ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆయతి ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈసందర్భంగా రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట ఇంద్రవెల్లివ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ మారుతి తదితరులున్నారు.

ఎఫ్ఆర్‌గా బాధ్యతలు చేపట్టిన షీలానంద్

ఉట్నూర్, జూలై2 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా షీలానంద్‌బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన అనిత ఉడుంపూర్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో పులిమడుగు డిప్యూటీ రేంజ్‌ఆఫీసర్‌గా పని చేస్తున్న శీలనంద్‌ను పదోన్నతి పై ఉట్నూర్ ఎఫ్ ఆర్‌ఓగా పోస్టింగ్ ఇవ్వడంతో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎఫ్ఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన శిలానంద్‌ను సెక్షన్ ఆఫీసర్ గోపాల్‌నాయక్, బీట్ ఆఫీసర్లు మర్యాద పూర్వకంగా సన్మానించారు.

చేనేత కార్మికుల రుణమాఫీ పట్ల హర్షం

బోథ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు 33 కోట్ల రుణమాఫీ నిధులు విడుదల చేసి ఆదుకుందని పేర్కొంటూ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్స్ రంగాలలో చేనేత కార్మికులు అభివృద్ధి చెందాలని కోరుతూ తీసుకున్న నిర్ణయం పట్ల ఎంతోమంది చేనేత కార్మికులు హర్షం వ్యక్తపరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు మెరుగు భోజన్న, గౌరవ అధ్యక్షులు గంగుల మల్లేష్, వడ్లకొండ సురేందర్, సిరిపురం చంద్రమోహన్, కొండ స్వామి, ఆడేపు కిరణ్ కుమార్, తౌడు మల్లేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన యువ నాయకులు

బోథ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సోనాల మండల కేంద్రానికి చెందిన ఈర్ల అభిలాష్ భరత్ లు కలిశారు ఈ సందర్భంగా వారు సోనాల మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కి నిధులు మంజూరు చేయాలని కోరారు అంతేగాక మండల కేంద్రంతో పాటు అంతర్ రాష్ట్ర రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

ఇంద్రవెల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీప్రియ సూచించారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎస్సెస్సీ ఫలితాల్లో వై.ఐశ్వర్య 565 మార్కులతో,ఇంటర్ ఫలితాల్లోరంభ 977మార్కులతో మండల స్థాయిలో ప్రతిభ కనబర్చడంతో వారిని శాలువాలతో ఘనంగా సత్కరించా రు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ సంగీత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

మావల, జూలై 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుక్తపూర్ వార్డు నెంబర్ 45 కలనీలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లకు బుధవారం భూమిపూజ చేశారు. ఇందులో ఏఈ నజీర్, మాజీ కౌన్సిలర్ బండారు సతీష్, వార్డు పీసర్ ప్రశాంత్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో ఎస్ఎస్‌జీ కమిటీ పర్యవేక్షణ

బోథ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో ఉండే పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామపంచాయతీల పనితీరుపై స్వచ్ఛ పర్యవేక్షణ గ్రామీణ ఎస్ఎస్‌జి టీంలు పర్యవేక్షిస్తున్నాయి. పాఠశాలల నిర్వహణతో పాటు మరుగుదొడ్ల నిర్మాణ ఎలా ఉంది అనేది ఈ బృందం సభ్యులు పరిశీలిస్తున్నారు. గ్రామపంచాయతీలో వసతులు ఉన్నాయా ఉంటే వినియోగిస్తున్నారా అనే అంశాలపై అక్కడికక్కడే పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. బోథ్, సోనాల మండల కేంద్రాల్లో బృందానికి చెందిన అధికారులు పర్యవేక్షించారు. అంతేగాక గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఏ విధంగా ఉందనేది అక్కడికి వెళ్లి పరిశీలిస్తున్నారు. మరోవైపు వచ్చిన అధికారులు ఆయా గ్రామాల కార్యదర్శులను వెంటేసుకొని పరిశీలించడం జరుగుతుంది.

నర్సాపూర్(జి)లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● తప్పిన పెను ప్రమాదం

నర్సాపూర్(జి), జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో బుధవారం ఉదయం 5:30 గంటల ప్రాంతంలో జరిగిన ఒక ప్రమాదంలో ఒక కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు టైర్ ఊడిపోగా, విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగిపోయింది. అయితే తెల్లవారు జాము కావడంతో ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన లైన్ ఇన్స్‌పెక్టర్ గోవర్ధన్ తక్షణమే విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. దీంతో మరింత ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి విరిపోయిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని అమర్చడంతో పాటు మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపోయినప్పటికీ ప్రజలకు గాని, పశువులకు గాని ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో విద్యుత్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి

నిర్మల్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ రాజన్న ఇటీవల చనిపోయిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీధర్, వినయ్, రాఘవేందర్, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు, ఎద్దు మృతి

తానూర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన గొర్ల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన ఒక ఆవు, ఒక ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రైతు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..రేకుల షెడ్డులో ఆవు, ఎద్దును ఉంచడంతో విపరీతమైన గాలుపు దుమారం, వర్షం రావడంతో గాలికి కరెంటు వైరు రేకులతో రాపిడి చేసి తెగిపోయింది.ఆ వైర్‌తెగి షెడ్డులో పడగా కిందంత నీరు ఉండడంతో షెడ్డులో విద్యుత్‌ప్రవాహం జరిగింది.రేకులషెడ్డులోని ఆవు, ఎద్దువిద్యుదాఘాతంతో మృతిచెందాయి.విద్యుత్ అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా కృషి చేయాలని రైతు కోరుతున్నాడు.

జిల్లా కేంద్రంలో డాక్టర్స్ డే వేడుకలు

● ప్రముఖ వైద్యులకు ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ సన్మానం

నిర్మల్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ్ బాంకెట్ హాల్‌లో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు జిల్లా వైద్య సంగం ఐఎంఏ అధ్యక్షులు డా. మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ల సేవను ప్రశంసించారు. ఈ సందర్భంగా డా. రామకృష్ణ, డా. కృష్ణం రాజు, డా. వేణుగోపాల కృష్ణ, డా. సుహాసిని, డా. పి. సంతోష్, డా. విద్యుల్లతా, డా. వరుణ్, డా. సుజనితా, డా. చంద్రిక, డా. స్వప్న, డా. ప్రవంతి, డా. సుచిన్, డా. ప్రియాంక తదితర వైద్యులు పాల్గొన్నారు. వారందరికీ షీల్డ్‌లు అందించి, వారి సమాజ సేవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకుడు షేక్ అన్సార్ పాషా మాట్లాడుతూ... డాక్టర్లు మానవతా విలువల సాక్షాత్కార రూపం, వారి సేవలను గుర్తించి సన్మానించడం మా సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ హెల్పిం గ్ సొసైటీ అధ్యక్షుడు అన్సార్ పాషా, మహిళా అధ్యక్షురాలు శోభారానితో పాటు సభ్యులు జున్నుఅనిల్, భీమయ్య, హరికృష్ణ, పి. శంకర్, తుమ్మల దేవరావు, రాజు, రంజిత్, శ్యామ్ ప్రకాష్, ఎస్. నాగరాజు, మమత, బంటి, టీఎన్జీవో ప్రభాకర్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం

ఆదిలాబాద్‌అర్బన్,జూలై2 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పలు అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఇసుక బజార్లు (సాండ్ స్టాక్యార్డ్) ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక రవాణా జరిగేలా సమగ్ర ప్రణాళికలు అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి తహసీల్దార్ తమ తమ మండలంలో అక్రమ ఇసుక రవాణా పై కఠినంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ఇసుక సరఫరా జరగాలని ఆదేశించారు. ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారానే రవాణా చేసుకోవాలని ఇంజనీర్ విభాగానికి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పై సమీక్ష నిర్వహించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయన్నారు. భూస్వాధీనం, ఎంట్రీలు, ఎగ్జిట్‌లు, రేషన్‌కార్డు ఆధారిత ధృవీకరణలు తదితర అంశాలకు సంబంధించి ప్రజలు తమఅభ్యర్థనలు సమర్పించారని తెలిపారు. కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ పెండింగ్ ఉన్న మండలాల పరిధిలోని లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ ఉట్నూర్ యువరాజ్, ట్రైని కలెక్టర్ సలోని, ఆర్డీఓ వినోద్‌కుమార్, డీసీఎస్ఓ, ఏడీ మైన్స్ ఏడీ ఎస్ఎల్ఆర్, పీఆర్ ఆర్అండ్‌బి, ఎస్‌డబ్ల్యు, ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఇరిగేషన్, ఈఈలు, తహసీల్దార్లు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ సర్వే, సర్వేయర్లు పాల్గొన్నారు.

● ఎస్సీ,ఎస్టీ చట్టాల పై ప్రజల్లో అవగాహన కల్పించాలి: పాయలశంకర్

ఆదిలాబాద్‌అర్బన్:షెడ్యుల్డుకులాల అభివృద్ధి విభాగం పీసీఆర్ చట్టం 1955 అండ్(పీఓఏ) చట్టం 1989 అమలును సమీక్షించడానికి జిల్లా స్థాయి నిఘా అండ్ పర్యవేక్షణ కమిటీ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా,జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఎస్పీఅఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయలశంకర్‌లు ముఖ్య అతిథిగా పాల్గొని యాక్ట్ పై నూతన కమిటీ సభ్యులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సభ్యుల కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. నిరం తరం ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి ఎస్సీ, ఎస్టీలకు సమాజానికి మంచి చేసేలా కార్యక్రమాలు చేపట్టి ముందుకు వెళ్లాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులను అభినందిస్తూ కమిటీ సభ్యులు చురుకుగా పని చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టాల పై ప్రజల్లో అవగాహన కల్పించాలని, నేరాలు జరుగకుండా చూడాలని తెలిపారు. పీసీఆర్ యాక్ట్ 1955, పీఓఏ యాక్ట్ 1989 పౌర హక్కుల రక్షణ చట్టం 1955,అనుసూచిత కులముల అనుసూచిత జనజాతుల (అత్యాచార నివారణ) చట్టం 1989 ఉద్దేశం సమాజంలో మార్పు కొరకు ఈ చట్టాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు, అధికారుల పాత్ర కీలక మైందని, సరైన రీతిలో ఈ చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైని కలెక్టర్ సలోని, సబ్ కలెక్టర్ యువరాజ్, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్

బోథ్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ సర్వీసెస్ డాక్టర్ జాదవ్ ఉపేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు శాతం రికార్డును పరిశీలించిన అనంతరం ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రి నుండి 8 మంది వైద్యులను బోథ్ పీహెచ్‌సీకి తాత్కాలికంగా బదిలీ చేయడం జరిగింది అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున డాక్టర్లు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బందికి ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

నార్నూర్: భారీ వర్షాల కారణంగా వ్యాధుల పట్ల జాగ్రత్త తీసుకోవాలని హెల్త్ సూపర్ వైజర్ చరణ్ దాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, గుంజాల, నాగల కొండ, కొత్తపల్లి (హెచ్), యూఐపీ సెషన్ సందర్శించి పలు సలహా సూచ నలు ఇచ్చారు. సబ్ సెంటర్ వద్ద గర్భిణి, చిన్నారులకు వ్యాక్సిన్ అందిం చారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగేలా చూడాలని పేర్కొన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, కలరా, అతిసార వ్యాదులు సోకకుండా చూడాలని అభిప్రాయపడ్డారు. వారి వెంట సిబ్బంది శిలా, జంగుబాయి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఉన్నారు.

నేరడిగొండ:సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్ వైజర్ సంతోష్ అన్నారు. బుధవారం మండలం లోని బొందిడి, సూరాపూర్ గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 86 మందిని పరీక్షింగా అరుగురికి జ్వరం, ఇద్దరికి అతిసారా సోకడంతో వారికీ చికిత్సలు అందించారు.ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డీ. ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక. సిబ్బంది సంధ్య, పూలబాయి, పాల్గొన్నారు.

సోన్: మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై సోన్‌పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిశిల్ప మాట్లాడుతూ...వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే చాలా వ్యాధులు దూరమవుతాయని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకన్న, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు,రవి కాంత్, గటిక రవికాంత్, జే. శ్రీధర్, డి. అరుణ, బలిరాం రాథోడ్, ఆశా సిబ్బంది రాజేశ్వరి, వనతి, లహరిక పాల్గొన్నారు.

పొలంబాటలకు.. మహర్దశ

(5వ పేజీ తరువాయి...)

ఈ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టడంతో బిల్లులు సకాలంలో వస్తాయో? రావో? అన్న అనుమానాలు వ్యక్తమవుతన్నాయి.

అడుగు వేయలేని పరిస్థితి

వర్షాకాలంలో పంట పొలాలకు వెళ్లాలంటేనే అన్నదాతలకు వణుకు పుట్టేది. కొన్ని గ్రామాల్లో అయితే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండేది. ముఖ్యంగా వర్షాకాలంలో కురిసే ముసురు వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారి నడవలేని పరిస్థితి ఉంటుంది. జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి నేలలే కావడంతో చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారి పశువులు సైతం నడవలేని పరిస్థితి ఉంటుంది. ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు బురదలో చిక్కుకోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీంతో పంటల సాగు పనులను వాయిదా వేసుకోవాల్సి వచ్చేది. ముఖ్యంగా మహిళా రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడేవారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి పొలం బాట దారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామాల్లో బురద దారులకు చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఈ పనులు పూర్తయితే రైతులకు బురద దారుల బాధలు దూరం కానున్నాయి.

నేటి నుంచి ముత్యాల, ఊల్లె పోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఖానాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గత అతి పురాతనమైన శ్రీశ్రీశ్రీ ముత్యాల, ఊల్లె పోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు సాగనున్న ఈ వేడుకల్లో గురువారం ఉదయం 9 గంటలకు నది జలాల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఉత్తర వాహిని గోదావరి నది నుండి తెచ్చిన నది జలాలతో అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. అమ్మవారికి అభిషేకం అనంతరం మధ్యాహ్నం పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీ నుంచి గొల్లెన (వలలతో అల్లిన జాలీ) వేసుకొని బోనాలతో భక్తులు భారీగా ఆలయినికి తరలిరానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకొని వేములవాడ నుంచి ప్రత్యేకంగా విచ్చేస్తున్న శివసత్తులచే అమ్మవారికి బోనాలను సమర్పించినట్లు తెలిపారు. గంగపుత్ర సంఘం అధ్యక్షులు పరిమి సురేష్ తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సురేష్ సహా ఆలయ కమిటీ బృందం కోరింది.

అక్రమ నిర్మాణాలు పూర్తిస్థాయిలో తొలగింపు



జేసీబీతో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న అధికారులు

కుభీర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి బజార్ రోడ్డులో ఉన్న ప్రధాన మురికి కాలువపై పలువురు అక్రమార్కులు అక్రమంగా రేకుల షెడ్‌లను నిర్మించారు. ఇందులో కొందరు అద్దెలకు సైతం ఇచ్చారు. వీటి నిర్మాణం ద్వార వర్షం కురిసినప్పుడు పలు కాలనీలు , ప్రభుత్వ ఆసుపత్రి, విఠలేశ్వర ఆలయం ముంపు గురవుతోందని పలువురు గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. కాగ స్పందించిన అధికారులు జూన్ నెల 16 న పూర్తి స్థాయిలో తొలగించాలని ఆదేశించిన అక్రమదారులు పాక్షికంగా కేవలం రేకులను మాత్రమే తొలగించారు. ఈ కార్యక్రమంలో భైంసా రూరల్ సీఐ నైలు, తహసీల్దార్ శివరాజ్, ఎంపీవో మోహన్‌సింగ్, స్థానిక ఎస్సై కృష్ణరెడ్డి, పోలీసులు తదితరులు ఉన్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయాలి

భైంసా, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ గ్రామస్థాయి నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి నియోజక వర్గ కాంగ్రెస్ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌లు పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఖర్గే సభ సన్నాహక సదస్సు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జై బాపు .. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సభ జరుగనుందని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడటం చాలా ముఖ్యమైన అంశమన్నారు. ఇది పార్టీ చరిత్రలో ఒక గొప్ప సమావేశమని, అందరూ విధిగా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంతేకాకుండా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ చెప్పే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. పార్టీ గ్రామ కమిటీలతోపాటు అనుబంధ సంస్థల కమిటీలు, మండల కమిటీలు, పార్టీ ప్రతినిధులు విధిగా సభకు హజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండలాల వారీగా సభకు తరలివచ్చే పార్టీ శ్రేణుల సంఖ్యవాహనాలు, మార్గమధ్యంలో భోజన వ్యవస్థ తదితర అంశాలపై చర్చించి కార్యచరణ ప్రణాళిక రూపొందించే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, భైంసా ఆత్మ కమిటీ చైర్మెన్ సిద్దం వివేక్ , మాజీ ఎంపీపీలు పొద్దుటూరి రాం చందర్ రెడ్డి, ఎస్. బోజరాం పాటిల్‌లతో నియోజక వర్గ పరిధిలోని ఆయా మండలాల పార్టీ ప్రతినిదులు పాల్గొన్నారు.

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఈ నెల 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ పటేల్ పిలుపునిచ్చారు.బుధవారంఖానాపూర్ వచ్చిన ఆయన మండల కేంద్రంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో నిరవహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గం నలుమూలల నుండి స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నాయకత్వంలో ప్రతి గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మల్లికార్జున ఖర్గే సభకు తరలివచ్చి సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, ఏఎంసీ చైర్మన్ భూమన్న, పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజుర సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగా నర్సయ్య, పెంబి మండల అధ్యక్షులు స్వప్నిల్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు యూసుఫ్ ఖాన్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మైనార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సలీమ్ ఖాన్, షౌకత్ పాషా, మాజీ కౌన్సిలర్ కిషోర్ నాయక్, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, శెట్టి శ్యామ్, జన్నారపు శంకర్, పరిమి సురేష్, జంగిలి శంకర్, రాజు నాయక్, సయ్యద్ ఆయుబ్, శేషాద్రి, శారు, ద్యావతి రాజేశ్వర్, తదితరులున్నారు.



సన్నాహక సదస్సు నిర్వహిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్

ఆదిలాబాద్: ఈనెల 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే జై భీం, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అడిషనల్ ఇన్‌చార్జి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంపు యాల్లోయాన్ని ఆయన సందర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడం ముఖ్యమని అందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గిమ్మ సంతోష్, పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, మాజీ కౌన్సిలర్‌లు సందా నర్సింగ్, జఫార్ అహ్మద్, సుధాకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు శాంతన్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, రావుల సోమన్న, మల్లయ్య యాదవ్, రాజేశ్వర్, శ్రీలేఖ, లతా, సోనియా, ఇందిర పాల్గొన్నారు.

నేరడిగొండ: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనం ఈ నేల 4న హైదరాబాద్ లోని ఎల్బీస్టేడియంలో సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని, దాదాపు గ్రామ స్థాయి నేతలతో బహిరంగ సభలో పాల్గొంటున్నారని కావున బోథ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొని సభను విజయవంతం చేయాలనీ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: ఆడే గజేందర్

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండి సైనికుల్లా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముఖ్య నాయకుల సమావేశంలో ఆడే గజేందర్ పాల్గొని మాట్లాడుతూ రేపు హైదరాబాద్‌లో జరగబోయే గ్రామస్థాయి కార్యకర్తల సమావేశానికి ప్రతిఒక్క రు హాజరు కావాలన్నారు.ఈసమావేశంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడేవసంత్ రావు, మాజీ జెడ్పీటీసీ గొక గణేష్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ త్రిత్రే నారాయణ సింగ్. బోథ్ యువజన విభాగం అధ్యక్షుడు పోతారెడ్డి,కన్వీనర్‌లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు

ఇంద్రవెల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా పంపిణి చేస్తున్న యూరియా, డీఏపీ సకాలంలో అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తనాలు వేసి దాదాపుగా 20, 25 రోజులు కావస్తున్న రైతులకు సకాలంలో ఎరువులు అందకపోవడంతో దిగులు చెందుతున్నారు. ఎరువులు రైతులకు అందించే విధంగా దూరదృష్టితో జిల్లా కలెక్టర్ రైతులకు అతి తొందరలో యూరియా, డీఏపీలు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఇపుకసడే కొన్ని మండలాల్లో ఎరువులు అందని పరిస్థితి ఉందని తెలిపారు. రైతులు వేసిన పంటలు పత్తి, సోయాబిన్, మొక్కజొన్న తదితర పంటలకు ఎరువులు వేసే సమయం కాబట్టి ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆనంద్ రావ్, బందు, రాము, జయబాయి, రంభ బాయి చిత్రు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

కుంటాల, జూలై, 2 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విట్టాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల సురేష్ (40) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. కుటుంబీకులు పోలీసుల కథనం మేరకు సురేష్ భార్య గత పది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుండి మనో వేదనకు గురైన ఆయన మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం ఇంటి నుండి బయలుదేరిన ఆయన గ్రామ సమీపంలో గల చెరువు కట్టపై చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు వారు తెలిపారు. మృతునికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.


ఎరువుల కొరతను తీర్చాలి

భైంసా, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ఎరువుల కొరతను తీరేందుకుగా తక్షణమే చర్యలు చేపట్టాలని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంబంధిత విషయంలో రైతులతో కలిసి భైంసా ఏడీఏ వీణాకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ తోట రాము మాట్లాడుతూ ఎరువుల కొరతతో రైతన్న పడరాని పాట్లు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. భైంసాలోనిమ కొందరు వ్యాపారులు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయాలు చేపడుతున్నాని ఆరోపించారు. అధికార యంత్రాంగం రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం గాను ఎరువులు సమృద్ధిగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో అధిక ధరల విక్రయాలపై విచారణ జరిపి సంబంధిత విక్రయదారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని వెల్లడించారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ కమిటీ ఎన్నిక

ముథోల్,జూలై 2 (ఆంధ్రజ్యోతి):మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం నిర్మల్ జిల్లా ముథోల్ మండలం మచ్కల్ గ్రామంలో నూతనంగా గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగిందని సంబంధిత నాయకులు తెలిపారు. ముఖ్య అతిథి నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి గంధమాల నాగభూషణ్ మాదిగ సమక్షంలో ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎమ్మార్పీ సీనియర్ నాయకుడు నంద కుమార్ మాదిగ, కత్తి బాబు మాదిగ, మా జన సోషలిస్ట్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంబేకర్ సాయిచంద్ మాదిగ పాల్గొన్నారు. కళ్యాణ్కర్ అవినాష్ (అధ్యక్షుడు), కళ్యాణ్కర్ దిగంబర్, వాగు మారే సాయబ్ (ఉపాధ్యక్షులు), శేష రావు (ప్రధాన కార్యదర్శి), విఠల్ (కార్యదర్శి),యోగేష్ (సహాయ కార్యదర్శి), సాయినాథ్ (ప్రచారకార్యదర్శి), దత్తహరి (కోశాధికారి), కార్యవర్గ సభ్యులు కళ్యాణ్ శ్యామ్, భోజారాం, మారుతి, సాయిప్రసాద్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని మార్చిన అధికారులు



బోరిగాంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసిన దృశ్యం

నేరడిగొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరిగాం బ్రిడ్జి సమీపంలో వేలాడు తున్న విద్యుత్ తీగల వల్ల ప్రజలకు ప్రమాదం ఏర్పడుతుం దన్న విషయంపై గత నెల 28న జాతీయ మానవ హక్కుల కమిటీ ఆదిలాబాద్ జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా బుధవా రం విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సం బంధిత ప్రాంతంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చే శారు. ఇందులో లైన్‌మెన్ రాథోడ్ ఉలాష్, ఏఎల్ ఎం రణధీర్, జాదవ్ పవన్, నిఖిల్‌లతో పాటు గ్రామ ప్రజలు ఉన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

భైంసా, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయలోకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో రాజీలేని రీతిలో బాధ్యతాయుతంగా పోరుబాట చేపడుతామని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ. రమణరావ్ పేర్కొన్నారు. బుధవారం భైంసా మండలంలోని మాటేగామ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. యూనియన్ ప్రాతినిధ్యం మేరకు ఎలాంటి షరతులు లేకుండా అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో వర్తింప చేసేలా హెల్త్‌కార్డుల జారీ ప్రక్రియ త్వరలోనే జరుగనుందన్నారు..ఇందులో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.రమేష్ రెడ్డి, ప్రతినిధులు రమేష్‌రవి, అ భారావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


సంస్థ తీరును నిరసిస్తూ.. ఆందోళన చేస్తున్న కార్మికులు(ఫైల్)


ఆర్జీయూకేటీ యూనివర్సిటీ


యూనివర్సిటీ ప్రాంగణం

ట్రిపుల్ ఐటీలో అవినీతి కంపు

- పారిశుధ్య నిర్వహణలో అక్రమాలు
- కాంట్రాక్టు గడువు ముగిసి మూడేళ్లవుతున్నా.. ఇంకా అదే సంస్థ కొనసాగింపు
- కార్మికుల జీతాల్లో కోతలు
- రికవరి కోసం అధికారుల ప్రయత్నాలు

బాసర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటి ట్రిపుల్ ఐటిలో అవినీతి కంపు కొడుతుంది. పారిశుధ్య నిర్వాహణలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కార్మికుల జీతిల్లో కోత విధిస్తూ.. రూ. కోట్ల ప్రభుత్వ నిధులు కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పని చేసిన అధికారుల తప్పిదాల వల్ల జరిగిన ఈ అవినీతి బాగోతంపై ఇప్పటి అధికారులు దృష్టి పెట్టిన్లు సమాచారం. అక్రమంగా కాజేసిన మొత్తాన్ని రికవరి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. యూనివర్సిటి నుంచి డబ్బులు చెల్లించాలని కాంట్రాక్టు సంస్థ, కుదరదు మీ దగ్గరే లెక్కకు మించి చెల్లించిన డబ్బులు ఉన్నాయని అధికారులు ఇలా ఎవరికి వారు వాదించుకున్నట్లు సమాచారం. ఈ పంచాయతీ వల్లనే కార్మికులకు రావాలల్సిన జీతభత్యాల చెల్లింపులో తీవ్ర జాప్యం చేసుకున్నట్లు తెలుస్తోంది.

రూ. కోటిన్నర అక్రమాలు

పారిశుధ్య నిర్వాహణలో అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రూ. కోట్ల నిధులు పక్కదాని పట్టాయని ఆరోపిస్తున్నారు. నాలుగేళ్ల నుంచి కొనసాగుతున్న సదరు సంస్థకు యూనివర్సిటి నుంచి చెలల్లించిన రూ. కోట్ల నిధుల లావాదేవీలపై విజిలెన్స్ విచారణ నిర్వహించాలని కార్మిక నాయకులు కోరుతున్నారు. సదరు సంస్థకు అధికారులు ఎందుకు అదనపు చెల్లింపు జరిపారు. అనే విషయం తేలాలి. యూనివర్సిటి అధికారులకు ప్రైవేటు సంస్థ తప్పుదారి పట్టించి రూ. కోట్లు కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత జీవో ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లిస్తూ.. యూనివర్సిటి నుంచి మాత్రం కొత్త జీవ ప్రకారం ఎక్కువ మొత్తంలో కాంట్రాక్టు సంస్థ బిల్లులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. కోటిన్నర విలువ అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. జీతభత్యాల కోసం కార్మికులు యూనివర్సిటి అధికారుల వద్దకు వెళ్లినప్పుడు ఇదే విషయాన్ని యూనివర్సిటి అధికారులు చెప్పడం గమనార్హం.

కాంట్రాక్టు ముగిసినా.. అదే సంస్థ కొనసాగింపు

2021 సంవత్సరంలో ప్రైవేటు సంస్థ పారిశుధ్య నిర్వాహణ కాంట్రాక్టు పొందింది. ఏడాది పాటు కాంట్రాక్టు కాలం. 2022లోనే కాంట్రాక్టు గడువు ముగిసింది. అధికారులు టెండర్‌లు వేసి కాంట్రాక్టులో మార్పులు చేయాలి. గతంలో యూనివర్సిటిలో పనిచేసిన సంస్థల పనితీరు బాగా లేకపోతే వెంటనే బ్లాక్‌లిస్టులో పెట్టి టెండర్‌లో క్వాలిఫై కాకుండా చూసుకోవచ్చు. కానీ పని తీరు బాగా లేకపోయినా కాంట్రాక్టు గడువు ముగిసినా అదే సంస్థను యూనివర్సిటి అధికారులు కొనసాగిస్తూ వస్తున్నారు. ఇలా ఏడాది కాంట్రాక్టు పొందిన సంస్థను మూడేళ్ల పాటు కొనసాగించడంపై అనేక సమస్యల కారణమైంది. కాంట్రాక్టు సంస్థతో అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మృతురాలి ఆర్థిక సహాయాన్ని పంచుకుని తిన్న ఘనులు

యూనివర్సిటి సెక్యూరిటి గార్డుగా పని చేసిన సురేఖ మృతి చెందితే.. తోటి సెక్యూరిటి సిబ్బంది ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఒక్కరోజు వేతనాన్ని కట్ చేసి ఆ మొత్తాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు ఇవ్వాలని కోరారు. 2023 సంవత్సరంలో జరిగిన ఈ ఘటన సెక్యూరిటీ సిబ్బంది జీతాల నుంచి ఒక్కరోజు వేతనం కట్ చేసిన ప్రైవేటు సంస్థ ఆ మొత్తాన్ని రూ. 60 వేలు మృతురాలి బంధువులకు అందివ్వలేదు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా.. ఇంకా ఇప్పటికీ చెల్లించలేదు. గతేడాది ఇదే విషయాన్ని సెక్యూరిటి సిబ్బంది యూనివర్సిటటి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదు. సురేఖ భర్త ముందే మృతి చెందారు. సురేఖ అనారోగ్యంతో మరణిస్తే.. వారికున్న ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. నిరుపేద ఈ కుటుంబాన్ని, పిల్లలను ఎంతోకొంత ఆదుకుందామని తోటి మిత్రులు చేసిన సహాయం కూడా అందకుండా రాబందుల్లా కాజేసిన ఇక్కడ చర్యలు తీసుకునే వ్యవస్థ లేదు. ప్రైవేటు సంస్థలో ఒక ఉద్యోగి యూనివర్సిటిలో పని చేసే మరో అధికారి ఆర్థిక సాయాన్ని పంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమార్కుల కారణంగా సెక్యూరిటీ సిబ్బంది తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఎవరైనా చనిపోతే ఆర్థిక సాయం అందించే పరిస్థితి కనిపించడం లేదు.

కమిటీలు వేసి సమస్యలను పరిష్కరిస్తాం
వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్

యూనివర్సిటీలో ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాం. ఎన్నో ఏళ్ల నుంచి పేరుకుపోయినటువంటి సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ.. ముందుకెళ్తున్నాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా ఉండి విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి ఎంతో ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. ప్రతి సమస్యకు పరిష్కారాన్ని చూపుతాం. అవసరమైతే కమిటీని నియమించి చర్యలు చేపడతాం.


గుంతలమయంగా మారిన బరంపూర్ అర్లి రోడ్డు దృశ్యం


బురద రోడ్డు నుంచి వెళుతున్న ప్రయాణికులు

గుంతల రోడ్డు.. బురద కష్టాలు

- భూమి పూజకే పరిమితమైన బరంపూర్ - అర్లి రోడ్డు నిర్మాణ పనులు
- గ్రామీణ ప్రజలకు తప్పని ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు

తలమడుగు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని రంగాలో అభివృధి పరచాలనే సంకల్పంతో ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులతో గ్రామాలకు రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల ఇష్ట రాజ్యంతో రోడ్డు నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ నుంచి అర్లి కె వరకు రోడ్డు నిర్మాణం కోసం గతంలో నిధులు మందులు కాగా రోడ్డు నిర్మాణ పనుల కోసం ప్రజా ప్రతినిధులు అధికారులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించినప్పటికీ రోడ్డు నిర్మాణ పను భూమి పూజకే పరిమితమయ్యాయి. దీంతో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తపప్పడం లేదు. కురుస్తున్న వర్షాలతో రోడ్డంతా గుంతల మయం బురదతో ప్రయాణికులకు బురద కష్టాలు తప్పడం లేదు. బరంపూర్ ఎక్స్ రోడ్ నుంచి అర్లి కె వరకు రోడ్డు నిర్మాణం కోసం దాదాపు కోటి 50 లక్షల రూపాయలు మంజూరు అయినప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా చకినాపూర్ అర్లి గ్రామాలకు చెందిన పాఠశాల విద్యార్థులు మోకాళ్లతో బురద గుంటలో నుంచి ప్రతిరోజు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు. అంతే కాకుండా అత్యవసర సమయంలో ఆ రోడ్డు నుంచి వెళ్దామంటే ప్రయాణికులు భయంతో గురవుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వర గా పూర్తి చేయాలని గ్రామస్తులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తం అవుతు న్నాయి. రెండు గ్రామాల మధ్య నిర్మించిన వంతెన నిర్మాణ పనులు సైతం అసంపూర్తిగానే ఉన్నాయి. ఇకనైనా అధికారుల అసంపూర్తిగా ఉన్న బరంపూర్ అర్లికే గ్రామాల రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.


బురదమయంగా మారిన అర్లి బరంపూర్ రోడ్డు


అధ్వాన్నంగా మారిన రోడ్డు

డ్రోన్‌తో గడ్డి మందు పిచికారీ

- గ్రామ కార్యదర్శి నిర్ణయంతో గ్రామస్థుల హర్షం

బోథ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో బుధవారం గ్రామ కార్యదర్శి డి.చిన్నగంగయ్య గ్రామంలో డ్రోన్ ద్వారా గడ్డి మందులు పిచికారీ చేయించారు. గ్రామంలోని ఖాళీ ప్రదేశాలలో పిచ్చి మొక్కలు గడ్డి పెరగడంతో డ్రోన్ ద్వారా మందును పిచికారి చేయించారు. దీంతో గ్రామస్థులు అధునాతన టెక్నాలజీ ద్వారా డ్రోన్ స్ప్రేను చూసేందుకు రావడం జరిగింది. ఏదిఏమైనా గ్రామ కార్యదర్శి నిర్మాణం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తపరిచారు. సమయం ఆదాతో పాటు సకాలంలో మందును పిచికారి చేయడం వల్ల పిచ్చి మొక్కలు పెరగకుండా ఉంటాయని గ్రామస్థులు అంటున్నారు.


పొచ్చెరలో డ్రోన్ ద్వారా గడ్డి మందు పిచికారి చేస్తున్న దృశ్యం

పాఠశాల భవనానికి పగుళ్లు

- ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి ● మర్మమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు


భీంపూర్ మండలం టెక్డి గూడ పాఠశాల


పైన స్లాబ్ ఊడిన పాఠశాలలో బిక్కుబిక్కుమంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు

భీంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఆదివాసీ గిరిజన విద్యార్థులు ఆ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఎప్పుడూ ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని టెక్డి గూడ ఆదివాసి గిరిజన గ్రామంలో పాఠశాల భవనం ఉంది. ఆ పాఠశాలలో మూడవ తరగతి వరకు సుమారు 19 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాని ఆ పాఠశాల పరిస్థితి చూస్తే దారుణంగా ఉంది. స్లాబ్ పగుళ్ల తేలి ఊడి పడుతున్నాయి. ఎప్పుడూ ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. విద్యాధికారులు పాఠశాలను సందర్శించిన దాఖలాలు లేవు. ఒక వేళ అనుకోని ఘటన ఏదైనా జరిగితే అందుకు బాధ్యులు ఎవరు అనేదే ప్రశ్న. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ముక్కుపచ్చలారని గిరిజన చిన్నారులు విద్యను అభ్యసిస్తున్న పాఠశాలను సందర్శించి పాఠశాల స్లాబ్‌ను మరమ్మతులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

పులి జాడ ఎక్కడా.. ?!

- బోథ్, నేరడిగొండ అడవుల్లో ఉన్నట్టా.. లేనట్టా!


ఇటీవల పులి దాడిలో మృతి చెందిన ఆవు(ఫైల్)

బోథ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బోథ్ అడవుల్లో అలజడి సృష్టించిన బెబ్బులి పులి జడ కనిపించడం లేదు. వారం రోజుల క్రితం బోథ్ రేంజ్ పరిధిలోని రఘునాథపూర్ నిగిని కంటే గం అడవుల్లో సంచరించి ఆవులపై దాడులు చేసింది ఆ తర్వాత అటవీ శాఖ అధికారులకు పులి ఉన్నట్టు సమాచారం రాలేదు.



పులి సమాచారం కోసం అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేయించిన బ్యానర్

● శిక్షకులు వస్తే పులిజాడ తెలిసేది

పులులను గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది జన్నారం రేంజ్ పరిధిలో ఉన్నారు. అక్కడి సిబ్బంది వచ్చి స్థానికంగా అడవుల్లో తిరిగి పులి సంచారంపై ఒక నిర్ణయానికి వచ్చేవారు. అయితే పులి వారం రోజులుగా కనిపించకపోవడంతో అసలు పులి ఉందా లేదా అనే విషయం అటవీశాఖ అధికారులకు అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామాల ప్రజలకు అంతుబట్టడం లేదు.

● దాడులు చేస్తేనే సమాచారం

పులి జాడ తెలియాలంటే అటవీ జంతువుల మీద దాడి చేయడం లేదా ఆవుల మందలపై దాడి చేస్తేనే పులి ఉన్నట్లు సమాచారం వస్తుంది. లేకుంటే పులిజాడ తెలిసేట్టు లేదని అటవీ శాఖ వారే అంటున్నారు. ఒకవైపు దట్టమైన అడవులకు తోడు అడవిలో కావలసినంత పులికి ఆహారం లభించడంతో బయటకు రాలేకపోతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేరెడిగొండ రేంజ్ పరిధిలో గత వారం రోజుల క్రితం నీలిగాయి మనుబోతుపై పులి దాడి చేసినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం వచ్చింది. ఆ తర్వాత పులి సమాచారం అక్కడికి అధికారులకు సైతం తెలియ లేదు.

● నిర్మల్ జిల్లా అడవుల్లోకి వెళ్లిందా..

పులి ఇక్కడి అడవిలో కనిపిం చకపోవడంతో నిర్మల్ జిల్లా అడ వుల్లోకి వెళ్లి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సహ్యాద్రి పర్వత శ్రేణుల గుండా పులి కడెం అడవుల్లోకి వెళ్లి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఏదిఏమైనా పులి జాడ తెలియాలంటే జంతువులపై ఎక్కడైనా దాడి చేస్తే పాద ముద్రలు కనిపిస్తే పులి జడ తెలిసే ఆస్కారం ఉంది.

కడెం అడవుల్లోకి వెళ్లి ఉంటుంది: అధికారి

బోథ్, నేరడిగొండ అడవుల్లో సంచరించిన పులి కడెం అడవుల్లోకి వెళ్లి ఉంటుందని రేంజ్ అధికారి ప్రణయ్ పేర్కొన్నారు. వారం రోజుల నుండి పులి ఉన్నట్లు తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. దాని అలజడి ఎక్కడ కూడా లేదన్నారు.

నీట మునిగిన పత్తి పంట

- ఆందోళన చెందుతున్న రైతన్నలు

తలమడుగు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా ఎడ తెరిపి లేకుండా వస్తున్న వర్షాలతో అప్పుడే మొలకెత్తిన పత్తి పంట మొక్కలు నీటితో మునిగిపోవడంతో రైతన్న ఆందోళన చేస్తున్నారు. ముఖ్యంగా వాగులు, వంకలు సమీపంలోని పంట పొలాల్లో వర్షపు నీరు రావడంతో పంటలను నీటి మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. అంతేకాకుండా కురుస్తున్న వర్షంతో పంట పొలాల్లో కలుపు మొక్కలు మనిషి పంటలు తెలియకుండా ఇబ్బందిగా మారాయి. కలుపు మొక్కలు తీసేందుకు మందుల షాపుల్లో కలుపు మొక్కల నివారణ మందులు అధిక ధరలు ఉండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాలు భారీ వర్షాలతో రైతులకు ప్రభుత్వం ఫజల్ బీమా సౌకర్యం కల్పించక పోవడంతో మరింత నష్టం వాటిలో అవకాశం రైతులను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తలమడుగులో భారీ వర్షాలతో నీట మునిగిన పత్తి పంట

సన్న వడ్ల సాగుకు రైతుల మొగ్గు

- బోనస్ ఎఫెక్ట్
- ఇప్పటికే మొలకెత్తిన నారు
- నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు

దిలావర్‌పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగు జోరందుకుంది. అడపా దడపా వర్షం కురుస్తుండటంతో రైతుల్లో ఖరీఫ్ సాగు కలిసి వస్తుందన్న ఆశలు చిగురిస్తున్నాయి. పంటలు సా గు చేసే విషయంలో ఇప్పటికే ఒక క్లారిటీకి వచ్చేశారు. ఇప్పటికే వేసిన విత్తనాలు మొలకెత్తి రైతుల్లో ఖరీఫ్ సాగుపై భరోసానిస్తున్నాయి. బోరుబావుల కింద మెట్ట పంటలు సాగు చేస్తుండగా కొంత భాగం వరి సాగుకు వదిలేశారు. బోరు బావుల కింద, చెరువులు, కుంటల కింద వరి సారు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం చేసి నారు పోశారు.

సన్నాలకే 'సై' అంటున్న రైతులు..

ఈ సారి దొడ్డు రకం వరి సాగు కాకుండా సన్నరకం వరి సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సన్న వడ్ల సాగు ఘననీయంగా పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది ఖరీఫ్‌లో 6,064 ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేయగా 1050 ఎకరాల్లో సన్న రకం వడ్లు, 5,014 ఎకరాల్లో దొడ్డు రకం వడ్లు సాగు చేశారు. ఈ ఏడాది మాత్రం సుమారు 6,150 ఎకరాల్లో వరి సాగు చేయవచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేయగా అందులో 2,500ల ఎకరాల్లో సన్న రకం వరి, 3,650 ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగు చేసేందుకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు బావిస్తున్నారు.


దిలావర్‌పూర్‌లో మొలకెత్తిన సన్న వడ్ల వరినారు


చర్లపల్లిలో సన్న వడ్ల నారు

సన్న రకం ధాన్యానికే డిమాండ్ ఉంటుందనే..

సాధారణంగా సన్న రకం బియ్యాన్నే తినడానికి జనం ఇష్ట పడతారు. అందులోను ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న రకం బియ్యాన్ని ఇస్తుండటం, సన్నరకం వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు ప్రభుత్వం బోనస్ ఇస్తుండటం రైతులకు కలిసి వచ్చే అంశాలు. అలాగే సన్న రకం బియ్యానికి విదేశాల్లో సైతం డిమాండ్ ఉండటంతో ఎగుమతి చేసే అవకాశం ఉంది. ఈ అంశాలన్నీ పరిశీలిస్తే సన్న రకం వడ్లకు మంచి డిమాండ్ ఉంటుందనే బావించి రైతులు సన్న వడ్ల సాగు వైపు మొగ్గు చూపుతున్నట్లు స్పష్టం అవుతోంది. దొడ్డు రకం వడ్లు విక్రయించేందుకు రైస్ మిల్లర్లను బతిమాలి ఇవ్వాల్సి వస్తుండటం, అందులోను తూకంలో కోతలు పెట్టడం రైతులను నష్ట పోయేలా చేస్తుండటంతో దొడ్డు రకం వడ్లు సాగు చేసేందుకు రైతులు కొంత విముఖత వ్యక్తం చేస్తున్నారు. సన్న బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో మద్దతు ధర లభించకపోయినా వడ్లను పట్టించి బియ్యం అమ్మితే ఎంతో కొంత కలిసి వస్తుందన్న అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఈ సారి సన్న వడ్ల సాగు పెరుగుతోంది..
- రాజశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి, దిలావర్‌పూర్



మండలంలో ఈ సారి సన్న వడ్ల సాగు ఘననీయంగా పెరుగుతోంది. సన్న వడ్ల విత్తనాలు అమ్మకాన్ని బట్టి ఇది స్పష్టమవుతోంది. ప్రభుత్వం ఇచ్చే రూ. 500ల బోనస్‌తో పాటు జనం ఎక్కువగా సన్న బియ్యంతో చేసిన అన్నం తినేందుకు ఇష్టపడటం, రేషన్ షాపుల ద్వారా సనన బియ్యం పంపిణీ కూడా సన్న వడ్ల సాగు పెరిగేందుకు అవకాశం ఏర్పడింది.

ఈ ఏడాది సన్న వడ్లనే సాగు చేస్తున్నా..
- కోడె పెద్ద ముత్యం, రైతు, దిలావర్‌పూర్



ప్రతి ఏడాది ఇంట్లో తినడానికి తప్ప సన్న వడ్లు సాగు చేసే వారం కాదు. ఈ సంవత్సరం మాత్రం సన్న రకం వడ్లనే సాగు చేస్తున్నాను. ప్రభుత్వం బోనస్ ఇస్తుంది. అదీ లేకపోతే బయట అమ్ముకోవచ్చు. దొడ్డు రకం వడ్లు అమ్మేటప్పుడు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అందుకే ఈ సారి సన్న వడ్లను సాగు చేస్తున్నా.. ఎవరు కొనకపోయినా వడ్లను పట్టించి బియ్యం అమ్మినా నష్టం లేదు.



● తాంసిలో పొలం బాట కార్యక్రమంలో భాగంగా వేసిన రోడ్డు

పొలం బాటలకు.. మహర్దశ

- జిల్లాలో 414 రోడ్లకు రూ.32 కోట్ల 40 లక్షల నిధుల మంజూరు
- వర్షాకాలంలో రైతులకు తప్పనున్న ఇబ్బందులు
- గ్రామాల్లో బురద రోడ్ల సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆదిలాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో అధ్వానంగా మారిన పంట పొలాల దారులను తిరిగి పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పొలం బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో పంట పొలాలకు వెళ్లే మట్టి దారులకు మహర్దశ కలగనుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఊరు దాటి బయటకు వెళ్లే పరిస్థితి ఉండదు.



● మావల మండలంలో పంట పొలాలకు వెళ్లే మట్టి రోడ్డు

కొన్ని గ్రామాల్లో దారులు సరిగా లేకపోవడంతోనే పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఎన్నో ఎకరాల భూములు బీడు వారిపోతున్నాయి. అష్టకష్టాలు పడి పంటలను పండించినా.. పంట దిగుబడులను ఇంటికి తరలించేందుకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో పంట పొలాలకు వెళ్లే దారుల విషయంలో గ్రామస్థుల మధ్య వివాదాలకు దారి తీస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి సమస్యలు, వివాదాలను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంట పొలాలకు దారులను తప్పనిసరిగా చేస్తూ.. ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అలాగే దారులను పునరుద్ధరించేందుకు ఉపాధి హామీ పథకం కింద భారీగా నిధులను మంజూరు చేస్తుంది. ప్రాధాన్యత క్రమంలో దారులను ఎంపిక చేసి అధికారులు పనులను చేపడుతున్నారు. ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలోని 21 మండలాల్లో మొత్తం 414 పనులను ఎంపిక చేశారు. దీంతో 620.8 కిలోమీటర్ల మేర పొలం బాట దారులను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు గాను రూ.32 కోట్ల 40 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులను కూడా ప్రారంభించారు. వర్షాకాలం కావడంతో ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. వర్షాలు తగ్గుముఖం పడితే పనులను పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పనులు వేగవంతంగా పూర్తి చేస్తాం

: రాథోడ్ శివరాం, పంచాయతీరాజ్ ఈఈ, ఆదిలాబాద్



పొలం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాకు రూ.32 కోట్ల 40 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లావ్యాప్తంగా 620.8 కిలో మీటర్ల మేర పొలంబాట దారులను పునరుద్ధరిస్తాం. ఈ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిని సారించారు. అక్కడక్కడ దారులకు అవసరమైన భూమి విషయంలో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నాం. రైతులు సహకరిస్తే పొలం బాట దారులకు శాశ్వతమైన పరిష్కారాన్ని చూపే అవకాశం ఉంటుంది. బిల్లులకు ఎలాంటి ఇబ్బందులు లేవు పనులు పూర్తికా గానే బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాలో 414 దారులకు నిధులు

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 414 పొలం బాట పనులను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. అదిలాబాద్ నియోజకవర్గంలో 94 పనులకు గాను రూ.7.25 కోట్లు ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 72 పనులకు రూ.5.28 కోట్లు బోథ్ నియోజకవర్గంలో 183 పనులకు రూ.15 కోట్లు ఖానాపూర్ నియోజకవర్గంలో 65 పనులకు గాను రూ.4.87 కోట్లను కేటాయించారు. ఇప్పటికే గుత్తేదారులకు పనులను అప్పగించిన అధికారులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో పంట పొలాలకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందులు తప్పనున్నాయి. అయితే

(తరువాయి 6వ పేజీలో...)



శస్త్ర చికిత్స అనంతరం రోగులతో రిమ్స్ వైద్య బృందం

రిమ్స్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్సలు

● వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ సూచించారు. తాజాగా ఆసుపత్రిలో నలుగురు రోగులకు అన్నవాహిక క్యాన్సర్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యులు జక్కుల శ్రీకాంత్, బండారి నరేందర్, దేవిదాస్, హిమాని, సతీష్, కార్తీక్, విజయ్ మోహన్, సత్యనారాయణ, ఆర్ఎంఓ చంపత్ రావు, తదితరులతో కలిసి వివరాలను వెల్లడించారు. సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఓ క్యాన్సర్ పేషంట్ ఒక ఊపిరితిత్తును స్తంభింప చేసి, కడుపులో నుంచి ఏకంగా అన్నవహికను తొలగించి, పెద్ద సంచిని అన్నవాహికగా మార్చడం జరిగిందని, తిరిగి పేషంట్‌ను యధావిధి పరిస్థితికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇటువంటి అరుదైన శస్త్ర చికిత్సలు ఆరునెలల కాలంలో దాదాపు మూడు వందలకు పైగా జరిగాయన్నారు. మున్ముందు అన్ని విభాగాల్లోనూ అరుదైన శస్త్ర చికిత్సలు జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయని, జిల్లా ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలి

● బడిబాట ద్వారా విద్యార్థులను చేర్పించాలి : పీవో

ఉట్నూర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి బడిబాట ద్వారా విద్యార్థులను సమీకరించి ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా అధికారులు, ఏటీడీఓలు, ఎస్సీఈఆర్టీలు ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం కింద తరగతుల వారీగా కొత్త ప్రవేశాలు కల్పించాలని, విద్యార్థుల హాజరు వివరాలు, విద్యార్థులకు నోటు పుస్తకాల సరఫరా, ఆశ్రకమ పాఠశాలలో మెస్ కమిటీల ఏర్పాటు, ఆశ్రమ పాఠశాలలకు ఆహార సరుకుల సరఫరా విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత పై ఆర్ఓ ప్లాంట్ పరిస్థితి, ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లో సూచించిన రిజిస్టర్‌ల (రికార్డులు) నిర్వహణ విద్యా కార్యాచరణ ప్రణాళిక 2025-26, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల ప్రమోషన్ కార్యకలాపాల నవీకరణ, మూసి వేయబడిన ప్రాథమిక పాఠశాలల సంఖ్య, మంజూరు చేయబడిన పోస్టులకు వ్యతిరేకంగా ఎందరు సీఆర్టీలు పని చేస్తున్నారు? తరగతులవారీగా ప్రాథమిక పాఠశాలల సంఖ్య లాంటి కార్యక్రమాలను సమీక్షించి, ఉపాధ్యాయ సిబ్బంది స్థానికంగా ఉంటూ విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ జాదవ్‌అంబాజీ, ఆసిఫాబాద్ డీడీ రమాదేవి, ఆర్‌సీఓ ఆగస్టిన్, ఎసీఎంఓ జగన్, జిల్లా క్రీడాధికారి పార్థసారథి, జీసీడీఓలు చాయా, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశంలో మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల రాయిగూడలోని విద్యార్థులు పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆత్రం భాస్కర్‌ని శాలువతో ఐటీడీఏ పీవో ఘనంగా సత్కరించి, ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డు పక్కన కాలువను తీయిస్తున్న అధికారులు

రోడ్డుపైకి మురికినీరు రాకుండా చర్యలు

బోథ్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రం సమీపంలోని ఆదిలాబాద్-నిర్మల్ వైపు వెళ్లే రోడ్డుపై మురికి నీరు పారి రోడ్డు గుంతల మయం అయ్యింది. దీంతో 'ఆంధ్రజ్యోతి'లో 'చిన్నపాటి నిర్లక్ష్యం రోడ్డంతా గుంతల మయం' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా బుధవారం జేసీబీ తీసుకువచ్చి గుంతల మయమైన చోట మురికినీరు నిలవకుండా జేసీబీ ద్వారా మురికి కాలువను తీయించి రోడ్డుపైకి నీరు రాకుండా చేశారు. స్థానిక ఎంపీడీవో రమేష్, ఈవో అంజయ్యలు దగ్గర నుంచి మురికి కాలువ పూర్తయ్యే విధంగా చూశారు. వైన్‌షాప్‌ల ముందర ఉన్న రోడ్డుపై నీరు ప్రవహిస్తుందని, అక్కడ కూడా రోడ్లపై మురికినీరు రాకుండా చూడాలని పలువురు గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు దరఖాస్తులు : స్టడీ సర్కిల్ డైరెక్టర్

మావల, జూలై 2(ఆంధ్రజ్యోతి): 10 నెలల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కుంటాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ హైదరాబాద్‌లని బంజారాహిల్స్‌లో జరుగుతుందన్నారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ కోచింగ్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను చేసుకోడానికి ఈనెల 7వ తేదీ వరకు మత్రమే అవకాశం ఉందన్నారు. డిగ్రీ పాసైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులు tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా మీ మొబైల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో శిక్షణ పొందిన అనే మంది సివిల్స్, గ్రూప్-1, 2 ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు. శిక్షణ సమయంలో అన్ని సదుపాయాలు కలుగజేస్తారని, అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగస్తుల పిల్లలు, మూడు లక్షల ఆదాయం మించిన వారు ఈ శిక్షణకు అనర్హులు అవుతారని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ కేంద్రం 94941249416 ఫోన్ నెంబర్‌లో సంప్రదించగలరని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'రైతులకు కర్షక మిత్ర కింద ఎకరానికి రూ.రెండు లక్షల రుణం'

బోథ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రైతన్న కోసం సహకార బ్యాంకులో అండగా ఉంటున్నాయని వారి కోసం ప్రభుత్వపరంగా వ్యక్తిగత రుణాలతో పాటు పాటు వివిధ రకాల రుణాలను అందిస్తున్నామని ముఖ్యంగా ఈ ఏడాది కర్షగామిత్ర కింద ఎకరానికి రూ.రెండు లక్షలు ఇవ్వడం జరుగుతుందని సహకార బ్యాంకు మేనేజర్ శైలజ పేర్కొన్నారు. బుధవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతులు సహకార బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఎకరానికి రూ.లక్ష ఇవ్వడం జరుగుతుందని, అయితే కర్షకమిత్ర కింద ఒక వ్యక్తికి రూ.10 లక్షల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ రైతు బ్యాంకు ద్వారా రుణం పొంది ఆర్థికంగా ఎదిగేందుకు పాటుపడాలన్నారు మరోవైపు మొండి బకాయిల వసూలు కోసం 2018 నుంచి రైతులు తీసుకున్న రుణాలపై సెటిల్‌మెంట్ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రైతులు బ్యాంకులో సంప్రదించాలని సూచించారు.

'పెట్టుబడి సహాయాన్ని ఆపవద్దు'

ఆదిలాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సహాయాన్ని బ్యాంకర్‌లు అప్పుల కింద కోత విధించవద్దంటూ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలిలోని బ్యాంకులో రైతుల ఖాతాల్లో జమ చేసిన రైతు భరోసా డబ్బులను అప్పుల కింద కట్ చేసుకుంటున్నారని తెలుసుకుని బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులతో మాట్లాడారు. రైతు భరోసా, ఉపాధి హామీ డబ్బులను అప్పుల కింద కట్ చేయొద్దని ఇటీవల బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సంబంధిత బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సగం మందికి రుణమాఫీ కాలేదని, రుణాలు రాక రైతులు తీవ్ర ఇబ్బందితో విపరీతంగా బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దయాకర్, శ్రీకాంత్, అశోక్, సాయిగౌడ్, సాయి, ఆశన్న రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

కొమురం భీం జంక్షన్ పునః రూపకల్పన

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● కలెక్టరేట్‌లో ఆదివాసీ సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశం ● పాల్గొన్న జిల్లా స్థాయి అధికారులు

ఆదిలాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా కొమురం భీం జంక్షన్ పునః రూపకల్పన అంశంపై ఆదివాసీ సంఘ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొమురం భీం విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన ఔటర్ రింగ్ వలన ట్రాఫిక్ నియంత్రణకు సమస్యలు, ప్రమాదాలు ఎక్కువవుతున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించడం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. విగ్రహాన్ని ఏమాత్రం తాకకుండా, చుట్టూ ఉన్న రౌండ్ జంక్షన్ (ఔటర్ రింగ్)ను తొలగించి, ట్రాఫిక్ సురక్షితంగా నడిచేలా పునః రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గత రోడ్ సేఫ్టీ మీటింగ్ లో ఈ అంశంపై చర్చించామని, స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేసినప్పటికీ ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు తగ్గడం లేదని, అందుకే ఔటర్ రింగ్ కుదింపు నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఆదివాసీ సంఘ నాయకులతో కలెక్టర్ ఈ విషయంపై చర్చించగా.. వారి వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సురేందర్, ట్రైనీ కలెక్టర్ సలోని, సబ్ కలెక్టర్ యువరాజ్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, పాల్గొన్న అధికారులు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

● బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ● అధికారులతో ఆపరేషన్ ముస్కాన్‌పై సమీక్ష

ఆదిలాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బాలల బాల్యం బడులకు అంకితం కావాలని, బాలలు కార్మికులుగా, కర్షకులుగా కొనసాగరాదని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా బాలలను పనులు చేయిస్తున్న హోటళ్లు, పెట్రోల్ బంకులు, ఇటుక బట్టీలు, దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేయాలని సూచించారు. బాలలను పనుల్లో పెట్టుకుంటున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ప్రతీ రోజు ప్రతీఒక్క ప్రదేశంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తూ బాల కార్మికులను నిర్మూలించాలన్నారు. ముఖ్యంగా పట్టణంలో యాచకులుగా ఉన్న చిన్నారులకు పట్ల ప్రత్యేకంగా వ్యవహరిస్తూ వారిని సంక్షేమ గృహాలకు లేదా బడులకు తరలించాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలోని ఆదివాసీ ప్రజల పట్ల ప్రత్యేక దృష్టిని సారిస్తూ వారి పిల్లలు బాల కార్మికులుగా ఉన్నట్లయితే తల్లిదండ్రులకు సరైన కౌన్సెలింగ్ ఇచ్చి వారిని బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా దాబాలలో ఎలాంటి పిల్లలు చిన్నారులు పనుల్లో ఉండకుండా పర్యవేక్షించాలని సూచించారు. సమిష్టి కృషితో విజయం సాధించవచ్చు అని బాల కార్మికుల వ్యవస్థను సమూలంగా శాశ్వతంగా నిర్మూలించాలని.. అదేవిధంగా గత సంవత్సరం రక్షించిన పిల్లలు ప్రస్తుతం ఎక్కడున్నారు వారి పరిస్థితి ఏంటి అనేది ఆరా తీయమని అధికారులకు సూచించారు.

జిల్లా పోలీస్ శాఖ తరపు నుంచి సీసీఎస్ బృందం షీ టీం బృందం ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన ఇద్దరు సీఐలతో కూడిన ముస్కాన్ బృందం సంసిద్ధంగా ఉంటూ బాల కార్మికుల వ్యవస్థను నాశనం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, సీఐలు ఎస్.చంద్రశేఖర్, గున్వంత్ రావు పద్మ, అంజమ్మ, జిల్లా సంక్షేమ అధికారి కె.మిల్కా, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకట్ స్వామి సీడబ్ల్యూసీ సభ్యులు సమీర్ ఖాన్, దశరథ్, డీసీపీఓ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు రాజలింగు, వినోద్ కుమార్, చైల్డ్ హెల్ప్ లెన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, ష్యూర్ ఎన్‌జీఓ డిస్టిక్ కోఆర్డినేటర్ కె.వినోద్, మహిత ఎన్‌జీఓ ప్రతినిధి శ్రీకాంత్, చైల్డ్ హెల్ప్ లెన్, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, పాల్గొన్న అధికారులు

గుంతల రోడ్డు.. బురద కష్టాలు!

- భూమిపూజకే పరిమితమైన బరంపూర్-అర్లి రోడ్డు నిర్మాణ పనులు
- గ్రామీణ ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

-7లో

ఆరు గ్యారంటీలతో మోసం చేసిన ప్రభుత్వం

● ఇంటి ముందు ఫ్లెక్సీతో ముక్రా(కె)లో నిరసన

ఇచ్చోడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ముద్రించిన ఫ్లెక్సీని ఇంటి ముందు అతికించి సెల్ఫీ దిగి నిరసన వ్యక్తం చేస్తున్నారు ఇచ్చోడ మండలంలోని ముక్రా(కె) గ్రామస్థులు. దీనిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అమలుకాని హామీలను నమ్మి ఓటు వేశామని, ఓటు వేసి గెలిపించినందుకు ప్రభుత్వం తమను మోసం చేసిందని ముక్రా(కె) గ్రామానికి చెందిన నాంవాడె మీనాక్షి తన ఇంటికి ఫ్లెక్సీ అతికించి వినూత్న నిరసన తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు పొందారని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి పాలనలో పథకాలు అమలు కావడంలేదని కాంగ్రెస్ పాలనలో బతుకులు ఆగమవుతున్నాయని ఆవేదనను వ్యక్తపరిచారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తానన్న ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్న హామీలు నెరవేర్చలేదన్నారు.

అంతేకాకుండా.. మాకు 2లక్షల రుణమాఫీ రాలేదు.. మాకు రెండు సార్లు రైతు భరోసా రాలేదు.. రూ. నాలుగు వేల పింఛన్ రాలేదు.. మాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు.. మహాలక్ష్మి పథకం కింద రూ.2500 రాలేదు.. మాకు న్యూట్రీషన్ కిట్ రాలేదు అంటూ ఫ్లెక్సీని రాయించి ఇంటికి అతికించి సెల్ఫీలు దిగి నిరసన వ్యక్తం చేశారు.



ఇచ్చోడ మండలం ముక్రా(కె) గ్రామంలో ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న మీనాక్షి కుటుంబ సభ్యులు